పదహారేళ్ల శాసనసభలో, 28+ ఏళ్లు పార్లమెంటులో... వెరసి 44 ఏళ్ల చట్టసభల అనుభవం కేంద్ర మంత్రి **జైపాల్‌రెడ్డి** సొంతం. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ఎంపికైన వాజ్‌పేయి, ఇంద్రజిత్ గుప్తాల సరసన నిలిచిన ఉద్దండుడు ఆయన. పార్లమెంటు వజ్రోత్సవాల సందర్భంగా 'ఈనాడు'తో మాట్లాడారు.



# సాధించింది స్వల్పమేమీ కాదు!

భారత పార్లమెంటు కాలపరీక్షకు నిలబడింది. విభిన్న వర్గాల వేదికగా నిలిచి మనమంతా ఒక దేశం అనే భావన కలిగించింది. అన్ని సిద్ధాంతాల అతివాదుల నుంచి మితవాదుల వరకు వివిధ సిద్ధాంతాల పార్టీలను, ఎంపీలను దశాబ్దాల పాటు ఒక సూత్రంలో ఉంచింది. బ్రిటన్ దిగువసభ(హౌస్ ఆఫ్ కామన్స్) వందల ఏళ్ల తర్వాత ఈ స్థాయికి ఎదిగి ఎడ్మండ్ బర్కే, గ్లాడ్‌స్టోన్, బెంజమిన్ డిసరెల్లీ, విన్‌స్టన్ చర్చిల్, ఎ.బీవన్ లాంటి గొప్పగొప్ప పార్లమెంటేరియన్లను అందించింది. ప్రపంచ పార్లమెంటులన్నింటికీ బ్రిటన్ పార్లమెంటే మాతృక. కాల పరీక్షకు నిలబడింది. చివరిసారిగా 17వ శతాబ్దంలో హింసాత్మక మార్పులు వచ్చాయి. ఆ తర్వాత ఏ కుదుపులూ లేవు. అయితే, ఆ స్థిరత్వానికి నాలుగు వందల ఏళ్లు పట్టింది. 19వ శతాబ్దం వరకు బ్రిటన్‌లో పురుషుల్లోనే అందరికీ ఓటు హక్కులేదు. అమెరికా, బ్రిటన్‌లలో 1920 తర్వాతే మహిళలకు ఓటు హక్కు వచ్చింది. భారత్ విషయానికి వస్తే 1952లోనే నేరుగా అందరికీ ఓటు హక్కు ఇచ్చాం. అయినా, భారత్ పార్లమెంటు నాణ్యత ఆరంభంలోనే అద్భుతంగా ఉంది. రాజ్యాంగ పరిషత్తు చర్చలు చదివితే మన రాజ్యాంగ నిర్మాతలైన రాజేంద్రప్రసాద్, అంబేద్కర్, నెహ్రూ, మున్షీ, బి.ఎన్.రావు తదితరులు ఎంతటి పరిపక్వతను ప్రదర్శించారో అర్థం అవుతుంది. బ్రిటన్, అమెరికా పార్లమెంటుల్లో మాట్లాడే భాష ఆంగ్లం ఒక్కటే. భారత్‌లో అనేకం. ఇలాంటి భిన్నభాషల వేదికగా పార్లమెంటును నడపడం భారత్‌కే సాధ్యం. మొదటి రెండు దశాబ్దాలు సభ పూర్తిగా ప్రజల ప్రధాని నెహ్రూ ప్రభావంలో నడిచింది. విపక్షంలోఉన్న ఆచార్య కృపలానీ, జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ నెహ్రూకు తీసిపోనివారే. వామపక్షాలకు పార్లమెంటరీ వ్యవస్థపై పెద్దగా నమ్మకం లేదు. వారి నుంచీ భూపేష్ గుప్తా, ఆక్స్‌ఫర్డ్‌లో ఆచార్యుడిగా పని చేసిన హిరేన్ ముఖర్జీ లాంటి గొప్పగొప్ప పార్లమెంటేరియన్లు వచ్చారు. సోషలిస్టు రాంమనోహర్ లోహియా కొద్దికాలమే ఉన్నా సభకు వన్నె తెచ్చారు. మరో సోషలిస్ట్ నేత, ప్రముఖ న్యాయవాది నాథ్‌పాయ్ ప్రసంగం ఉందంటే నెహ్రూ ఎక్కడున్నా సభలోకి పరుగున వచ్చేవారు. నాథ్‌పాయ్ వయస్సులో చిన్నవాడైనా నెహ్రూ ఆయనకు కృపలానీతో సమానంగా గౌరవం ఇచ్చేవారు. హిందూత్వ జాతీయవాదుల్లో వాజ్‌పేయి 1957లో ఎన్నికైనప్పటి నుంచే గొప్ప వక్త. బహిరంగ సభల్లో సాధారణంగా ప్రజల్ని అలరించే వక్తలు చట్టసభల్లో మేధావులను ఒప్పించలేరు. అది వాజ్‌పేయికి వర్తించదు. సీపీఐకి చెందిన ఇంద్రజిత్ గుప్తా ఒక ఆదర్శ పార్లమెంటేరియన్. సీపీఎం సంస్కృతిలో జ్యోతిబసూ ఎన్నదగ్గవారే. మధూ దండావతే పరీక్షకు సిద్ధమయ్యే విద్యార్థిలా శ్రద్ధగా నోట్స్ రాసుకుని సభకు వచ్చేవారు. హిందీ, ఆంగ్లభాషల్లో అలవోకగా ప్రసంగించే ఆయన ఎక్కువ సమయాన్ని గ్రంథాలయంలో గడిపే వారు. నియోజకవర్గానికి వెళ్తున్నా మరో రెండు రోజుల్లో సభలో లేవనెత్తాల్సిన అంశాల మీదే దృష్టి. సోమ్‌నాథ్ చటర్జీ, ఇంద్రజిత్ గుప్తాలూ గ్రంథాలయంలో ఎక్కువ సమయం గడిపేవారు. ఈ కాలపు ఎంపీలు సభలో కనిపించరు. గ్రంథాలయాల్లోనూ కనిపించరు. సెంట్రల్ హాల్లో మాత్రమే వారిని చూడగలం. మొదటి మూడు సభల్లో ప్రఖ్యాతులు సభ్యులుగా ఉండేవారు. హిందూ జాతీయవాదుల నుంచి నిప్పులుగక్కే మార్క్సిస్టుల వరకు విభిన్న ఉన్నత సిద్ధాంతాలకు చెందిన సభ్యుల నియంత్రణ, సమన్వయం విషయంలో భారత పార్లమెంటు పోషించిన పాత్ర మరే పార్లమెంటు పోషించలేదని చరిత్ర విద్యార్థిగా సాధికారికంగా చెప్పగలను.

సి.ఎన్.అన్నాదురై ఒకసారి తమిళులకు సొంత దేశం ఎందుకు కావాలో చెబుతూ పార్లమెంటులో ప్రసంగించారు. సభ్యులంతా ఓపిగ్గా విన్నారు. ఆయన తన వాదాన్ని ఎంత బలంగా వినిపించినా ఆ రోజు సాయంత్రానికి జాతీయవాదిగా మిగిలిపోయారు. భారత పార్లమెంటు ఇలాంటి తీవ్ర సిద్ధాంత వాదులకూ నీడనిచ్చింది.

నేటి పార్లమెంటులోని విద్యాధిక సభ్యుల్లో శాస్త్ర, సాంకేతిక, ఆర్థిక, మేనేజ్‌మెంట్ రంగాల్లో ఆరితేరిన వారున్నారు. అమెరికా, యూరప్ దేశాల్లో చదువుకొని వచ్చారు. వారు తమ విద్యా నేపథ్యాన్ని సరిగ్గా వినియోగించుకోవాలి. చాలా సమయాన్ని గుంపులు కట్టడం, సంబంధాలు పెంచుకోవడంలోనే వృథా చేస్తున్నారు.

సభలో ఉత్తమ ప్రసంగాలు చేసినపుడు మీడియాలో గుర్తింపు రావడం లేదు. గొడవలు, సరదా సంభాషణలకు అనవసరపు ప్రాధాన్యం ఇస్తున్నారు. గతంలో ఒకసారి నేను 15 రోజులు కసరత్తు చేసి సభలో ప్రసంగించాను. అంశాలను అధ్యయనం చేయడం, ఒక అవగాహనకు రావడం, సరైన పదాలు ఎంచుకోవడం ఎంతో కష్టపడ్డాను. నిజంగా ఇలా తయారుచేసుకున్న ప్రసంగం కవిత్వంతో సమానం. భారత మొదటి గవర్నర్ జనరల్ వారెన్ హేస్టింగ్స్ మీద బ్రిటన్ దిగువ సభలో ఎడ్మండ్ బర్కే చేసిన ప్రసంగం చదివితే తెలుస్తుంది ఆ పండితుడు ఎన్ని వారాలు కసరత్తు చేశారో. గొప్ప పార్లమెంటేరియన్ కావాలంటే సాహితీ పిపాసి అయి ఉండాలి. మీరో గొప్ప ప్రసంగంచేసి, మీడియాలో వార్తే రాకపోతే మళ్లీ అలాంటి అనవసరపు ప్రయాసకు ఎందుకు సిద్ధపడతారు? అందుకేనేమో, ఇప్పటి ఎంపీలు వార్తాపత్రికల ఆధారంగా సహజ ప్రసంగాలకు అలవాటుపడ్డారు. వ్యవసాయం, సాంఘిక సంక్షేమంపై చర్చ ఉంటే మీడియా గ్యాలరీలో ఎవరూ ఉండరు. ఏదైనా సంఘటన జరిగితే సభలో అంతా మాట్లాడతారు. తీవ్రమైన చర్చల్లో పాల్గొనడానికి మాత్రం ఎవరికీ సమయం దొరకదు. అయితే, పార్లమెంటు సభ్యుల్లో ఇప్పటికీ నాణ్యత ఉంది. అలాంటి వారికి మంచి ప్రేరణ కరువైంది. సంపన్నులు గతంలో కన్నా ఎక్కువగా పార్లమెంటుపై ఆధిపత్యం వహిస్తున్నారు. పార్టీలు డబ్బులున్న వారికే టికెట్లు ఇవ్వాలనుకుంటే అంతకన్నా విషాదం లేదు. గతంలో కన్నా ఎక్కువ మంది నిమ్నకులాల ప్రతినిధులు సభకు ఎన్నికవుతున్నా వారు ప్రభావవంతంగా వర్గ సమస్యల్ని లేవనెత్తలేక పోతున్నారు. ప్రభావవంతంగా మాట్లాడలేక పోవడంపై ఇంకా సాకులు చెల్లవు. మరింత కృషి చేయాలి. ప్రతీ వారినీ అంబేద్కర్‌ను ఉదాహరణగా తీసుకొమ్మని చెప్పను. అందరూ ఆయనంత మేధావులు కాలేక పోవచ్చు కానీ, ఆయనంత కష్టపడే వాళ్లు మాత్రం కావొచ్చు.

సభలో గొడవలు అత్యంత ఆందోళన కలిగించే అంశం. విలువైన సమయం వృథా అవుతోంది. ఈ విషయంలో ప్రధాన పార్టీలూ తమ బాధ్యత నుంచి తప్పించుకోలేవు. కాంగ్రెస్, భాజపా, వామపక్షాలు కలిసి సభను సజావుగా జరిగేట్లు చూడాలి. నాణ్యమైన ప్రసంగాలను ప్రోత్సహించాలి. సభలో రోజూ గొడవ అంటే ఎలా? సభ ప్రశాంతంగా ఉందంటే హాజరు ఉండదు.

–న్యూస్‌టుడే, న్యూఢిల్లీ

---

నేర చరితుల విషయంలో పార్టీలకు స్వీయ నియంత్రణ లేదు. విజయం తప్ప ఏ విలువలకూ పార్టీలు గౌరవం ఇవ్వడం లేదు. దశాబ్దాలుగా విపక్షంలో కూర్చున్న పార్లమెంటేరియన్లను వారి సేవలు, త్యాగాల ప్రాతిపదికన ఇప్పటికీ ప్రజలు గుర్తు పెట్టుకుంటు న్నారని గ్రహించాలి.

పార్టీలు నేర చరిత్ర ఉన్న వారికి టికెట్లు ఇవ్వబట్టే పార్లమెంటు ప్రతిష్ఠ దెబ్బతింటోంది. ఎంత పరపతి, డబ్బులు ఉన్నా నేర చరితులు స్వతంత్ర అభ్యర్థులుగా గెలవడం లేదనే విషయం పార్టీలు గ్రహించాలి. గుర్తింపు పొందిన పార్టీల టికెట్లతోనే వారు సభలోకి ప్రవేశిస్తున్నారు.

---



అటు నిప్పులుగక్కే వామపక్ష వాదులుగా గానీ, ఇటు కరడు గట్టిన హిందూ జాతీయవాదులుగా గానీ పార్లమెంటులోకి అడుగుపెట్టిన నేతలెవరూ పార్లమెంటు పదవీకాలం ముగిసేసరికి అంతే తీవ్రత కలిగిన అతివాదులుగా మిగిలిపోలేదు. వారి పంథాలోనే మితవాదులుగా మారారు. పార్లమెంటు ప్రతీ వాదానికి మధ్యేమార్గాన్ని కనుగొంది.

తొలితరం పార్లమెంటు సభ్యులు ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జిలలో చదువుకున్నా వారు భారత పార్లమెంటు నుంచే ఎక్కువ నేర్చుకున్నారు. వారి ఆలోచనలకు విరుద్ధమైన భావాలతో సంఘర్షణలో రాటుదేలారు. హేతుబద్ధత ఉన్న ప్రతీ సభ్యుడి పైనా ఇతర సభ్యుల ఆలోచనా సరళి ఎంతోకొంత ప్రభావం చూపింది. పదహారేళ్ల ప్రాయంలో కమ్యూనిస్టుగా మారిన ఇంద్రజిత్ గుప్తా మరణించే వరకు కమ్యూనిస్టుగానే ఉన్నా గొప్ప ప్రజాస్వామ్య ఉదారవాదిగా తనువు చాలించారని నా అభిప్రాయం. వాజ్‌పేయి కరడుగట్టిన హిందూ జాతీయవాదిగా తన పార్లమెంటు ప్రస్థానాన్ని ఆరంభించినా మితవాద లౌకికవాదిగా మిగిలిపోయారని అంటాను. ఇదే భారత పార్లమెంటు సారం.